# వెంకటాచలపతీ-వడుల ఊర్వశి

వెంకటాచలపతికి అన్నడానికి పెద్ద ఆఫీసర్ అయిన 'మంచి తిండి తినడానికి కూడా మొహం వాచిపోయాడు.

ఇలాంటి వెంకటాచలపతిలు మనకు తెలుస్ను వాళ్లలో చాలామంది వుంటారు.

ఆంధ్రరాష్ట్రంలో మొగాడికి సరైన తిండి దొరకక పోవటానికి ఒక భర్తే కారణం కాదు. ఎంతో మంది ధనవంతులు కూడా మంచి భోజనానికి మొహం వాచిపోవడానికి కారణం వాళ్ల పెళ్లాలే.

వాళ్లలో వెంకటాచలపతికి పెళ్లాం కూడా ఒకతే. ఆవిడది అదోరకమైన కేసు.

అందరూ ఒక రూటులో వెళ్తాంటే తనకీ వాళ్ళకీ పోలికేం ఉన్నట్లు ఆవిడ మరో రూట్లో వెళ్తుంది.

వెంకటాచలపతికి తన పెళ్లాం సంగతి శోభనం రోజే తెలిసింది. గదిలోకి రాగానే 'గ్లాసుతో వస్తే పాలనుకుని నోట్లో పెట్టుకున్నాడు. తీరా చూస్తే పుల్ల మజ్జిగ.

తనేదో పొరపాటు పడి తెచ్చిందేమో అని అడిగాడు కూడాను.

దానికి సమాధానంగా తొలిరోజు పాలు తాగితే మిగతా అందరి శోభనానికి మన శోభనానికి తేడా ఏంటట. అందుకే మన ప్రత్యేకత ఈ విధంగా నిరూపించుకున్నాను అంది సంతోషంగా.

దాంతో ఒళ్లుమండిన వెంకటాచలపతికి నీలాగే నేను కూడా. ప్రత్యేకతలు గల మనిషిని, మరి నా స్పెషాలిటీని చూడు అంటూ పరుపు క్రింది నుంచి 'ట్రిబులెక్స్ రమ్ము క్వార్టర్ బాటిల్' తీశాడు.

అంతే గది టారెత్తి పోయినట్లు అరిచి పెడబొబ్బలు పెట్టసాగింది. తాగుబోతును అంటగట్టి తన కొంప ముంచారంటూ ఏటొచ్చి అదృష్టం బావుండి బయట జనాలకి ఆ అరుపులు సరిగా వినపడక అదేదో పెళ్లి కూతురి తొలి శోభనం తాలూకు సిగ్గు కేకలు అనుకుని బంధువులంతా ముసిముసిగా నవ్వుకున్నారు. ఆ వెంటనే వెంకటాచలపతి తేరుకుని గొడవ పెద్దదైతే తన శోభనం కాస్త అటకెక్కి 'అసలు సని ఎసరొస్తుందని' ఆ రమ్ము సీసా కాస్తా కిటికీలోంచి బయటకు విసిరేసి పెళ్లాన్ని దగ్గరకు తీసుకుని తనేదో సరదాకి ఏడిపించటానికి ఆ పని చేశానని ఓదార్చాడు.

అంతే ఆ రోజు నుంచి వెంకటాచలపతి తన పెళ్లానికి పూర్తిగా దొరికిపోయాడు. అంతా అయిపోయింది.

వెంకటాచలపతికి ఇష్టమైన అలవాట్లు ఎన్నో, తన పెళ్ళానికి ఇష్టం లేక మానుకోవాల్సి వచ్చింది. అలాగే తన పెళ్లాం చేసే పనినీ వెంకటాచలపతి అడ్డు చెప్పటానికి వీల్లేకుండా పోయింది. ఆఖరికి అన్ని రకాలుగా పెళ్లానికి ఎడ్జస్ట్ అయిపోయాడు గానీ ఒక్క తిండి విషయంలో మటుకు కాలేకపోయాడు.

ఆ విషయంలో మటుకు వెంకటాచలపతికి ఇల్లు నరకమై పోయింది. తన కిష్టమైనదేదో సక్రమంగా వండి పెట్టదు.

ఆ రోజు కూడా వెంకటాచలపతి అన్నం కూరలూ వడ్డించగానే మామూలుగా కంచం విసిరి గొట్టి వాష్ బేసిన్‌లో చేతులు కడుక్కొని ఆఫీస్‌కి వచ్చేశాడు.

వచ్చేశాడు గానీ అసలు బుర్ర సని చేయట్లేదు. తన గదిలోకి ఎవర్నీ పంపవద్దని బయట ప్యూన్‌కి చెప్పేసి లోపలికొచ్చి ఒక గంటన్నర సేపు పెళ్లాన్ని పచ్చి బూతులు తిట్టుకున్నాడు.

వెంకటాచలపతికి పెళ్ళయినప్పటికి మంచి తిండి విషయంలో తన పెళ్లాం ఎన్ని రకాలుగా ఏడిపించిందో ఒకటొకటీ గుర్తుకు రాసాగింది.

ఓసారి బెండకాయ కూర వండింది. కూరంతా జిగురు జిగురు, పెదాలు రెండూ అంటుకుపోయాయి ఎరాల్డేట్ పెట్టినట్లు. దానికి కారణం బెండకాయలు నిలువుగా తరిగి, పచ్చిపచ్చిగా మగ్గించింది. అప్పటికి వెంకటాచలపతికి చెప్పి చూశాడు. బెండకాయలు అడ్డంగా తరిగి ఉప్పునీటిలో బాగా కడిగితే జిగురుండదు. అంతేగానీ ఇలా నిలువుగా తరగొద్దూ అని.

కానీ ఆవిడ ఎడ్డం అంటే తెడ్డం అనే రకం. అంతేగాదు తన పుట్టింట్లో అలాగే తింటారంది.

మరోసారి కాకర కాయ పచ్చడి చేసింది. నోట్లో పెట్టుకోగానే కుపుక్కున వుమ్మేశాడు, పరమ చేదు.

మరల మామూలుగానే చాలా శాంతంగా ఇదేంటే నీయమ్మ ఇలా వండి చచ్చావు అని అడిగాడు.

తన పుట్టింట్లో అలాగే తింటారు అని చెప్పింది, మరి కొంచెం కావాలా అని అడిగింది.

ఇంక వెంకటాచలపతికి కోపం పట్టలేకపోయాడు.

నీ పుట్టింట్లో అంటే నీ బాబుకి షుగరు, నీయమ్మకి షుగరు, నీకేమో షుగరు, నీ బామ్మకి షుగరు కాబట్టి అలా తిని చచ్చారు.

నాకేం ఖర్మే మా వంశంలో ఎవరికీ చక్కెర వ్యాధి లేదు. ఈసారి కనక కాకర కాయ పచ్చడి చేశావో చంపేస్తాను. ఒకవేళ చేస్తే కాకరకాయ గుత్తిలా కోసి మధ్యలో శనగపిండి కారం నేసి

## ఫిటింగ్ మాస్టర్స్

బజ్జీలు వేయించినట్టు నూనెలో వేయిస్తే చక్కగా తింటాను అని చెప్పాడు.

అయినా సరే వెంకటాచలపతి పెళ్లాం మొగుడు చెప్పినట్లు వినలేదు సరికదా తన మొండితనంతో పట్టుదలగా మార్కెట్లో ఎక్కువ డబ్బిచ్చి కొని మరీ వరుసగా మూడు వారాల పాటు రోజూ కాకర కాయ పచ్చడే చేసింది.

అలాగే ఒకరోజు చపాతీలు చేస్తుంది. అందులోకి కూరండదు. అంటే నేనిలాగే తింటాను. ఇష్టమైతే తినండి లేకపోతే మానండి అంది. మరో రోజు ఇడ్లీ చేసింది, అందులోకి బంగాళాదుంప కూర చేసింది. (పూరీలో వేసుకుంటారు అలాంటిది)

మళ్ళీ వెంకటాచలపతికి కోపం వచ్చేసింది. ఏంటే నీయమ్మ, ఇడ్లీలోకి పూరీ కూరా చేస్తావు. పూరీల్లోకి సాంబారు కొబ్బరి చెట్నీ చేస్తావు. నీ తిండి తగలెయ్య. అసలు నీ పుట్టింట్లో మనుషులకు చక్కటి తిండి గురించి తెలిసి చస్తే గదే. పసువులు మేసినట్లు ఒక పెద్ద గోళెంలో అన్ని రకాల పదార్థాలు కలుపుకుని 'కుడితి తాగే వంశం.'

కథ, కార్టూన్లు: వాణీసుబ్రహ్మణ్యం

నా కర్మే నా కర్మ. పెళ్లికి ముందు వంద కేజీలు బరువుండే వాడిని. ఇపుడో ముప్ఫయి కేజీలు, నిన్ను చేసుకున్నాకే ఇలా తగలడ్డాను అంటూ ఆఫీస్‌కి వెళ్లిపోయాడు.

పాపం ఎన్నాళ్లని. వెంకటాచలపతి జ్వరం వచ్చి మంచం పట్టాడు ఓ పది రోజుల పాటు.

ఆ సమయంలో మాత్రం వెంకటాచలపతి పెళ్ళాం మొగుడికిష్టమైన వంటకాలన్నీ చేసుకుని తెగ బలిసింది.

ఓ రోజు జీడిపప్పు పకోడీలు చేసుకుని తింటూండగా, ఇంక కోపం పట్టలేక అంత నీరసంలోనూ తినవే నీయమ్మ తిను. తిని తిని నువ్వేమో అలా బలిశావు. అసలు తిండిలేక ఇదిగో నేనిలా చచ్చాను అన్నాడు చిక్కిపోయిన తన శరీరం కేసి చూసుకుంటూ.

★ ★ ★

ఓ రోజుతాలూకాఫీస్ సెంటర్లోని అయ్యర్ హోటల్‌లో నెలకు సరిపడ భోజనం టికెట్లు తీసుకున్నాడు. మొదట్లో ఓ పది రోజులు బానే వున్నట్లనిపించింది.


కానీ ఆ తరువాత అది కూడే విసుగొచ్చి తన పెళ్ళాం వంటే బెటరేమో అనిపించింది కూడాను.

కొన్నాళ్ల పాటు ఏం చేయాలో.తెలీక ఆఫీస్‌లో లంచ్ టైంలో తన సీట్లోనే నీరసంగా కూర్చున్నాడు..

అప్పటికే ఆఫీసులో అందరికీ వెంకటాచలపతి పరిస్థితి తెలిసిపోవటంలో ఒకళ్లిద్దరు వాళ్ళకి లంచని పిల్చి వాళ్ల కేరియర్లో తెచ్చుకునేది. వీటిని కూడా పెట్టేవారు. అది కూడా ఎన్నో రోజులు నడవలేదు. వాళ్ళు తెచ్చుకున్న దాంట్లో మూడొంతులు వీడే అవురావురుమని తినేయటంతో వాళ్ళకేమీ మిగిలిన అర్ధాకలితో లేచేవారు. దాంతో వాళ్ళు కొన్నాళ్లు చూసి ఇక లాభం లేదని వీడిని తమతో భోజనానికి పిలవటం మానేశారు.

వాళ్లు పిలవక పోయేసరికి ఓ రెండు రోజులు జిహ్వను చంపుకోలేక వెంకటాచలపతికి వాళ్ళకు తెలీకుండా వాళ్లేదో పని మీద బయటకు వెళ్లినప్పుడు దొంగచాటుగా వాళ్ల కేరీరు లోంచి కొంచెం కొంచెం తినేసి మరలా యథావిధంగా సర్ది పెట్టేవాడు.

మొదట్లో ఈ విషయం తెలీక ఆఫీస్ స్టాఫ్ కేరీయర్లో అన్నం అదీ చాలా తక్కువ పెడ్తున్నారని ఇంట్లో పెళ్లాల మీద విరుచుకు పడేవారు. ఆ తరువాత అసలు సంగతి బయట పడింది. కారియర్ల దొంగ తమ బాస్ వెంకటాచలపతేనని.




ఎంతైనా బాస్ కదా, వాళ్లు కూడా ఏమీ అనలేక తమ భోజనం క్యారీర్లన్నీ వాళ్ళకు తెలుసున్న వేరే సెక్షన్లో పెట్టుకుని వచ్చేవారు. ఎన్నాళ్ళని సరైన తిండి లేకుండా వుండగలడు. ఊళ్లో ఏ హోటల్ వెళ్లినా కూడా భోజనం నచ్చట్లేదు.

భోజనం ఇంట్లో వండినంత చక్కగా బయట హోటల్లో ఎలా వుంటుంది (ఇంట్లో అంటే తనింట్లో గాదు.)

అప్పటికీ తెలుసున్న బంధువులిళ్ళలో కొన్నాళ్ల పాటు జాలి పడి భోజనం పెట్టేవారు. దాంతో బాగుందనుకుని సాయంత్రం సదేయ్యేసరికి వాళ్ళ భోజనాల టైంకి వెంకటాచలపతి సిద్ధం అయ్యేవాడు.

దాంతో ఆ బంధువులు కాస్తా వీడి బాధ పడలేక వాళ్ల భోజనాల సమయాన్ని మార్చేసుకుని ఉదయం భోజనాలు మధ్యాహ్నం ఒంటి గంటకు సాయంత్రం భోజనాలు అర్ధరాత్రి పన్నెండు గంటలకు ఏర్పాటు చేసుకున్నారు.

ఇక లాభం లేదనుకుని మనోడు ఆఫీసు వదలగానే రోడ్డు మీద పడ్డాడు.

ఓ రోజు రైల్వే స్టేషన్ వద్ద చెట్టు కింద ఊళ్లో ముష్టోళ్లందరి దగ్గరా తలో అర్ధ రూపాయి తీసుకుని అన్నం పెట్టే అవ్వ దగ్గర భోం చేశాడు వెరైటీ కోసమని.




పాపం అలా తిరిగి తిరిగి అలసిపోయి మున్సిపల్ పార్క్‌లో పడుకున్న వెంకటాచలపతి మీద ఓ పళ్లెంలో మసాలా వడలూ, సెనగ పప్పులూ అమ్ముకునే ఓ పందొమ్మిదేళ్ల అమ్మాయి గుమ గుమలాడే వడలతో వున్న పళ్లెంతో సహా దబీమని పడిపోయింది.

చక్కని మసాలా వాసన గుప్పుమని రావటంతో వెంకటాచలపతి ఒక్కసారిగా లేచి కూమని ఒడిలో పడ్డ 'పిల్లని' చూసి వులిక్కిపడ్డాడు.

పాపం ఆ పిల్ల కూడా బిక్క మొహం వేసుకుని క్షమించండయ్యా కుక్క తరుముకు రావడంతో కంగారుగా పరిగెత్తటంతో ఇలా జరిగింది అంటూ లేచి సర్దుకోసాగింది.

క్రింద పడ్డ వడలని కూడా చూడకుండా మొత్తం ఆ అమ్మాయి పళ్లెంలోని సరుకంతా లబగ లాగించేసి ఆ పిల్ల చేతిలో వంద నోటు పెట్టేసరికి "ఆ వడల ఊర్వశి" మహా ఆనందపడిపోయింది.

ఆ విధంగా పరిచయమైన ఆ వడల ఊర్వశి ఇంటికి వెంకటాచలపతి రోజూ వెళ్లి రెండూ పూటలా భోజనం చేసేదాక పెరిగింది వాళ్ల పరిచయం.

వెంకటాచలపతి కథ పూర్తిగా విన్న వడల ఊర్వశి వెంకటాచలపతికి ఓ సలహా ఇచ్చింది.

తనకెవ్వడా ఎవరూ లేరు.. ఒకవేళ ఎవరినైనా పెళ్లి చేసుకున్న వాడు రోజూ తాగొచ్చి తనని నాలుగు తన్ని వున్న డబ్బులు కాస్తా లాక్కుపోతే సుకం ఏంటి. అలాంటి మొగుడు వుండటం కన్నా అసలు పెళ్లి చేసుకోపోవటమే మంచిది.

అందుకే వెంకటాచలపతితో చెప్పింది, తనని వుంచుకోమని.

ఆ మాటతో వెంకటాచలపతి ఎగిరి గంతేశాడు.

నిన్ను వుంచుకోవటమేంటే నా దృష్టిలో నువ్వే నా మొదటి పెళ్లానివి, నా అసలు పెళ్లామే వుంచుకున్నదాని కింద లెక్క అని చెప్పి వడల ఊర్వశి బుగ్గపై ముద్దెట్టుకున్నాడు.

ఆ రోజే వడల ఊర్వశిని తీసుకెళ్లి ఓ టూ బెడ్ రూం ఫ్లాట్‌లో కాపురం పెట్టేశాడు.

మొదటిసారి పెళ్ళి చేసుకున్నప్పుడు అసలు తిండి లేకుండా చచ్చిపోతానేమో అని భయపడ్డ వెంకటాచలపతికి ఈ రెండో పెళ్ళితో 'వడల సుందరి' మూడు పూటలా చక్కటి భోజనం పెట్టటం వలన తన పాత బరువు వంద కేజీలకన్నా మరో ఇరవై కేజీలు పెరిగాడు. ఇప్పుడు వెంకటాచలపతి బరువు నూటిరవై కేజీలు. ★